



## ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలి

- కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లకు అధికారులు సన్నద్ధం కావాలని, కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అన్నారు.ఈ ఏడాది యాసంగి ధాన్యం కొనుగోళ్ల ప్రణాళికపై జిల్లా ధాన్యం కొనుగోలు కమిటీ మిగతా 2లో..



www.aakshitha.com
People's voice
అక్షిత
జాతీయ దినపత్రిక
AKSHITHA NATIONAL DAILY
తెలంగాణ దిక్సూచి
బుధవారం । 25 । మార్చి । 2026







- ఏరులై పారుతున్న పారిశ్రామిక వ్యర్థాలు
- పెరుగుతున్న కాలుష్యం ప్రజారోగ్యానికి ముప్పు
- ఢిల్లీని మించిపోయిన పటాన్ చెరు పారిశ్రామిక వాడల కాలుష్యం
- ముందస్తు రక్షణ చర్యలు తీసుకోకపోతే భవిష్యత్తు నాశనం

# ప్రమాద స్థాయికి పారిశ్రామిక కాలుష్యం

**సంగారెడ్డి, అక్షిత బ్యూరో:** **హైదరాబాద్ శివారు పటాన్‌చెరు పరిసర ప్రాంతాల్లో పారిశ్రామిక కాలుష్యం ప్రమాద స్థాయికి చేరింది. ఫార్మా, డ్రగ్, బల్క్ డ్రగ్ పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయన వాయువులు ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఈ ప్రాంతంలో 180-200 పరిశ్రమలు పనిచేస్తున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తెలిపారు.**

పరిశ్రమల నుంచి వెలువడే వోలటైల్ ఆర్గానిక్ కంపౌండ్స్ కారణంగా ఘాటు రసాయన వాసనలు 10-15 కిలోమీటర్ల దూరం వరకు వ్యాపిస్తున్నాయని నిపుణులు పేర్కొన్నారు. గాలిలో ప్రయాణించే ఈ కాలుష్య కారకాలు నల్లగండ్ల, గచ్చిబౌలి, బాచుపల్లి, జేఎన్‌టీయూ ప్రాంతాల వరకూ ప్రభావం చూపుతున్నాయి. హైదరాబాద్‌లో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. ఇటీవల నగరంలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 253కు చేరడం ఆందోళన కలిగిస్తోంది. ముఖ్యంగా హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో కాలుష్యం అధికంగా నమోదవుతోంది. పటాన్‌చెరు పరిధిలోని అమీన్‌పూర్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 201గా నమోదు కాగా, పారిశ్రామిక ప్రాంతాల్లో ఇది 200కు చేరువలో ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం గాలిలో పీఎం 2.5 స్థాయి 5 మైక్రోగ్రాములు ఉండాలి. అయితే హైదరాబాద్‌లో ఇది 70.4 మైక్రోగ్రాములకు చేరి, ప్రమాణాల కంటే 14 రెట్లు అధికంగా ఉంది. మిగతా 2లో..

## బ్లాక్ మార్కెట్లో డొమెస్టిక్ గ్యాస్ దందా

- గృహ వినియోగదారులకు తీవ్ర ఇబ్బందులు
- గుట్టుచప్పుడు కాకుండా హోటల్స్, రెస్టారెంట్లకు డోమెస్టిక్ గ్యాస్ మళ్లింపు
- కమర్షియల్ బండ్లలోకి
- రీ-ఫిల్ చేస్తున్న హోటళ్ళ నిర్వాహకులు



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి మండలంలో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల నల్లబజారు వ్యవహారం రోజురోజుకూ విస్తరిస్తూ సాధారణ వినియోగదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రభుత్వాలు గ్యాస్ కొరత లేదని స్పష్టంగా ప్రకటిస్తున్నప్పటికీ, స్థానికంగా మాత్రం పరిస్థితి ఇందుకు విరుద్ధంగా కని పిస్తోంది. గృహ వినియోగదారులు రోజుల తరబడి గ్యాస్ కోసం ఎదురుచూడాల్సి వస్తుండగా, మరికొందరు గ్యాస్ ఏజెన్సీల చుట్టూ తిరగడం సాధారణంగా మారింది.మండలంలోని కొన్ని గ్యాస్ ఏజెన్సీలు గుట్టుచప్పుడు కాకుండా డోమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను హోటల్స్, రెస్టారెంట్లకు అక్రమంగా సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాధారణంగా గృహ వినియోగానికి మాత్రమే ఉపయోగించాల్సిన ఈ సిలిండర్లను కమర్షియల్ అవసరాలకు మళ్లించడం వల్ల నిజమైన వినియోగదారులు నష్టపోతున్నారు. మిగతా 2లో..

## 'చర్చి స్థలం' లొల్లి..!

- సిఎస్ఐ వర్సెస్ ప్రైవేట్ వ్యక్తుల మధ్య భూవివాదం
- పట్టణంలో ముదురుతున్న గందరగోళం
- మత విద్వేశాలకు దారితీస్తున్న భూ పంచాయతి
- సామాజిక మాధ్యమాల వేదికగా వాదోపవాదాలు
- భూ పంచాయతిలో నెగ్గేదెవరో....?



**నర్సంపేట, అక్షిత ప్రతినిధి:** వరంగల్ జిల్లాలోని అతి పెద్దదిలో రెండవదిగా, నర్సంపేట నియోజకవర్గంలోనే ఏకైక రైల్వేస్టేషన్ కలిగి ఉండి, రవాణా సౌకర్యాలకు నెలవై, విస్తీర్ణంలో అతిపెద్ద మండల కేంద్రంగానూ, ఎఫ్ సిఐ గోదాములు కలిగిన నెక్కొండ పట్టణం దినాదినాభివృద్ధి చెందుతోంది. అన్ని రంగాలకు అనుకూలంగా పరిసర మండలాలకు కేంద్రబిందువుగా ఉండటంతో రానున్న రోజుల్లో మున్సిపాలిటీ గాను, నియోజకవర్గంగానూ 'నెక్కొండ' అవతరించనుంది. దీంతో భూకబ్జాదారులు విలువైన భూములపై తమ పాగా వేసి,వివాదాలు సృష్టిస్తుండడంతో రోజురోజుకు నెక్కొండలో భూ సమస్యలు పేరుకుపోతున్నాయి. పట్టణ ప్రాంతంలోని ఖరీదైన ప్రభుత్వ భూములు, వివిధ దేవాలయాలు, చర్చి, మసీదులకు చెందిన ఏళ్లనాటి భూములపై కబ్జాకోరులు మిగతా 2లో..

## ఇవేలా ఆకస్మిక తనిఖీలు?

### ఆకస్మిక తనిఖీల అర్థం మార్చేసిన అధికారులు




**వరంగల్, అక్షిత బ్యూరో:** అధికారులు ఆకస్మిక తనిఖీ అంటే అనుకోకుండా చేసేది ఆకస్మికానికి కానీ ప్రస్తుత రోజుల్లో ఏదో కార్యక్రమం పేరు చెప్పుకొని ముందే అందరికీ సమాచారం అందించి టెంట్లు షామియానాలు వేసి రహదారి చుట్టూ ముగ్గులు వేసి సాధారణంగా ఆహ్వానించి స్వాగతం పలికేదాన్ని ఆకస్మిక తనిఖీలు అంటున్నారు.

### ఇవి ఆకస్మిక తనిఖీలా

ఇది ఎలా ఉంది అంటే పోలీస్ పెట్రోలింగ్ వస్తున్నా వారు నేరస్తులను పట్టుకునేందుకు సైరాన్ కొట్టుకొని వస్తున్న విధంగా ఉన్నది కానీ అప్పటికే నేరస్తులు అక్కడి నుంచి సురక్షిత ప్రాంతానికి వెళ్లి తమను తాము రక్షించుకునేందుకు సైరన్ వేసినట్టుగా ఈ ఆకస్మిక మిగతా 2లో..

## బ్లాక్ మార్కెట్లో డొమెస్టిక్ గ్యాస్ దందా

(మొదటిపేజీ తరువాయి)

ఇంకా కొన్ని చోట్ల హోటల్ నిర్వాహకులు తనిఖీల భయంతో డోమెస్టిక్ సిలిండర్లలోని గ్యాస్‌ను కమర్షియల్ సిలిండర్లలోకి రీ-ఫిల్ చేస్తున్నట్లు సమాచారం. ఇది భద్రతాపరంగా కూడా అత్యంత ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ, సంబంధిత అధికారులు ఈ అక్రమాలపై పెద్దగా దృష్టి సారించకపోవడం గమనార్హం.

గ్యాస్ సరఫరాలో లోపాలు ఉన్నాయని వినియోగదారులు పలుమార్లు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ, ఏజెన్సీలు మాత్రం "కొరత లేదు" అంటూ ప్రకటిస్తూ సమస్యను నిర్లక్ష్యం చేస్తున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరింతగా, గట్టిగా ప్రశ్నించిన వినియోగదారులకు సీలు లేని గ్యాస్ సిలిండర్లను డెలివరీ బాయ్స్ అందజేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇది వినియోగదారుల భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తోంది. ఈ పరిస్థితుల్లో గ్యాస్ సిలిండర్ కోసం వినియోగదారులు పడుతున్న ఇబ్బందులు రోజురోజుకు పెరుగుతున్నాయి. మహిళలు, వృద్ధులు ప్రత్యేకంగా ఇబ్బందులు పడుతూ తమ దైనందినజీవితాన్నినిర్వహించడంలో కష్టాలు ఎదుర్కొంటున్నారు.

ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు మేల్కొని, నల్లబజారు దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని, అక్రమంగా గ్యాస్ సరఫరా చేస్తున్న వారిపై కేసులు నమోదు చేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలుకోరుతున్నారు. గ్యాస్ సరఫరా వ్యవస్థను పారదర్శకంగా నిర్వహించి, ప్రతి గృహానికి సమయానికి సిలిండర్ అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## ఇవేలా ఆకస్మిక తనిఖీలు?

(మొదటిపేజీ తరువాయి)

తనిఖీలు తయారయ్యాయి. పూర్వపు రోజుల్లో గతంలో వరంగల్లో పనిచేసిన కలెక్టర్ సునీల్ కత్రే, పోలీస్ శాఖలో విధులు నిర్వహించిన అప్పటి డీఎస్పీ సుమతి, ఇంకా కొంతమంది ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు అంటే అనుకోకుండా నైట్ డ్యూటీలు చేస్తున్న డాక్టర్లను పోలీస్ సిబ్బందిని పాఠశాలలను కళాశాలలను అనుకోకుండా వ్యవసాయ శాఖలను తనిఖీలు నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం 99 రోజుల ప్రణాళికలు కార్యక్రమాల్లో ముందస్తు కార్యక్రమాలు ఏర్పాటు చేసుకొని ఆకస్మిక తనిఖీల పేరిట కొత్త పేర్లు పెడుతున్నారు.

**ఇప్పటికైనా మారాలి:** ఇప్పటికైనా ప్రభుత్వాలు ప్రభుత్వ యంత్రాంగం అధికార రాజకీయ నాయకులు తాము చేస్తున్న విధులకు న్యాయం జరిగేలా పేద ప్రజలకు క్షేత్రస్థాయిలో ఫలాలు అందాలంటే ఆకస్మిక తనిఖీలు అనుకోకుండా చేసేవిగా ఉండాలి ముందస్తు ఏర్పాట్లు చేసుకొని ఆకస్మిక తనిఖీలు అనడం ప్రజలను మోసం చేయడమే పాలనలో జవాబుదారితనం లోపించడమే దీని ప్రజలు గమనిస్తున్నారనేది ప్రభుత్వాలు గమనించాలి.

### తనిఖీలు లేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

తెలంగాణ రాష్ట్రంలో రెండవ రాజధానిగా చెప్పుకునే వరంగల్ నగరంలో ఉన్న ఎంజీఎం దవాఖానాలో వైద్యుల సక్రమంగా విధులు నిర్వహించడం లేదని గత ఆరు మాసాల నుండి ప్రధాన బాధ్యతల్లో ఉన్న వైద్యులు విధులు నిర్వహించకుండా ఉన్నతాధికారుల సహకారంతో సంతకాలు మాత్రమే చేస్తూ విధులకు డుమ్మా కొడుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్కు అనేక ఫిర్యాదులు చేసినప్పటికీ వైద్య శాఖ ఉన్నతాధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఆకస్మిక తనిఖీలు గాని వైద్యులను గాడిలో పెట్టడం గాని చేయడం లేదు పైగా ఈ విషయాలు బయటకు ఎలా వెళుతున్నాయని వైద్యులు ఫోన్లలో అలాగే దవాఖాన పరిసరాల్లోనే గిల్లికజ్జాలు పెట్టుకుంటున్నారు. ఇన్ని రోజులు గడుస్తున్నప్పటికీ జిల్లా కలెక్టర్ ఆదేశాలు గాని ప్రభుత్వ పెద్దల ఆదేశాలు గాని వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఈ సంఘటనలపై దృష్టి సాధించడం లేదు, అందుకే ఇప్పటి ఆకస్మిక తనిఖీలు అన్ని అరేంజ్మెంట్ తనిఖీలుగా మారాయి.

### దేశిటికాల ప్రాథమిక ఉన్నత పాఠశాల

## ఆకస్మిక తనిఖీ

**- డిఇఓ రమేష్ కుమార్**

**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** నాగర్ కర్నూల్ పట్టణంలోని దేశిటికాల ప్రాథమిక ఉన్నత పాఠశాలను జిల్లా విద్యాధికారి ఏ.రమేష్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిఇఓ రమేష్ కుమార్ విద్యార్థులతో మాట్లాడి వారి చదువుల తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయుల బోధన పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.



# ధాన్యం కొనుగోళ్లకు సన్నద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

సమావేశం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది యాసంగి సీజన్ లో 2 లక్షల 73 వేల 550 ఎకరాల్లో వరి ధాన్యం సాగైందని తెలిపారు. 6 లక్షల 46వేల 320 మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేస్తున్నామని, 3 లక్షల 67 వేలా 776 మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందన్నారు.

జిల్లాలో ఐకెపి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డిసిఎంఎస్, హాకా ద్వారా 322 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా పౌరసరఫరాలు, కో-ఆపరేటివ్, డిఆర్ డిఓ, మార్కెటింగ్ తదితర శాఖల అధికారులు ఇందుకు సన్నద్ధంగా ఉండాలని ఆదేశించారు.

కొనుగోలు కేంద్రాల్లో తార్పాలిన్, తేమయంత్రాలు, బరువుతూచే యంత్రాలు, ప్యాడి క్లీనర్లు, డ్రైయర్లు, కాలిపర్స్ వంటి సదుపాయాలు సిద్ధం చేయాలని ఆదేశించారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలన్నారు. పూర్తిగా పక్వానికి వచ్చిన ధాన్యం మాత్రమే కోసేలా రైతులకు, హార్వెస్టర్ల యజమానులకు అవగాహన కల్పించాలని సూచించారు. రైస్ మిల్లులకు ధాన్యం కేటాయింపు ధాన్యం, రవాణా తదితర ఏర్పాట్లు నిబంధనల ప్రకారం జరగాలని ఆదేశించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, లోతట్టు ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, అడిషనల్ డీసీపీ వెంకటరమణ, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగారావు, పౌరసరఫరాల సంస్థ డిఎం రజనీకాంత్, డిఆర్ డిఓ శ్రీధర్, డి.సి.ఓ రామానుజాచార్య, డిఎమ్ఓ షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# 'చర్చి స్థలం' లొల్లి..!

(మొదటిపేజీ తరువాయి)

కన్నేస్తూ, రాజకీయ,తమ అంగబలంతో తప్పుడు దృవపత్రాలు సృష్టించి మరీ సంబంధిత అధికారులను సైతం పక్కదారి పట్టిస్తూ ధర్జాగా కబ్జా చేస్తున్నారు.

అట్టి భూమిలో సైతం ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ, కోట్లకు పడగలెడుతున్నారని మండల వాసులు వాపోతున్నారు.

### పేరుకుపోతున్న భూ సమస్యలు- రెచ్చిపోతున్న కబ్జాదారులు

రానున్న రోజుల్లో 'నెక్కొండ బంగారుకొండ'గా అవతరించనున్న నేపథ్యంలో మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు భూములపై కబ్జాదారులు కన్నేసి, ఎలాగైన దక్కించుకోవాలనే సంకల్పంతో తప్పుడు ధ్రువపత్రాలు సృష్టిస్తూ, అధికారులను సైతం తమ రాజకీయ, ధనబలంతో పక్కదారి పట్టించి యథేచ్ఛగా ఆక్రమణకు పాల్పడుతున్నారు.

ఇక ప్రైవేట్ స్థలాల విషయంలో స్థల యజమానికి పరిసర స్థల గెట్టుల విషయంపై ఇరువురికి గొడవలు సృష్టిస్తూ, వారి అవసరాలను ఆయుధంగా చేసుకుని, ఎలాగైన స్థలం పొందాలనే తమ వక్రబుద్ధిని ఉపయోగించి, భవిష్యత్తులో ఖరీదు కానున్న భూము లను అడ్డగోలు ధరలకే ఆక్రమణ చేసుకుంటున్నారు. ఇట్టి విషయంపై సంభందిత ఉన్నతాధికారులు దృష్టి సారిస్తూ పూర్వాపరాలను పరిశీలిస్తూ, గత పహాణీల ఆధారంగా ప్రభుత్వ స్థలాలను గుర్తించి, హద్దులు కేటాయిస్తూ, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి, కబ్జాకోరుల నుండి ప్రభుత్వ భూములను కాపాడుతూ,భూవివాదాలను ఎప్పటికప్పుడు కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### నెక్కొండలో 'హాట్ టాపిక్‌గా చర్చి స్థల వివాదం

నెక్కొండ మండల వ్యాప్తంగా సిఎస్ఐ చర్చి వర్సెస్ ప్రైవేట్ వ్యక్తులకు సంబంధించిన భూవివాదం 'హాట్ టాపిక్‌గా మారి, సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. సిఎస్ఐ చర్చి సంఘం సభ్యులు వర్సెస్ ప్రైవేట్ వ్యక్తులు, ఆయా ఇరువురి సానుభూతిపరులు వాట్సాప్ వేదికగా పరస్పర వాదనలు చేసుకుంటున్నారు. పట్టణ పుర ప్రముఖులు సైతం ముచ్చటిస్తూ స్వాతంత్ర్యానికి పూర్వం నెక్కొండలో రెవ.ఆరోను ఫాదర్ అనునతడు పాకాల ప్రాంతాన్ని మిషనుగా ఏర్పాటు చేసి, విద్య, వైద్య వసతులతో నాణ్యమైన విద్యను నిరుపేదలకు అందించాలనే ఉద్దేశంతో పాఠశాల ఏర్పాటు కోసం 5 ఎకరాల 29 గుంటల భూమితో మొదటిగా ఫాదర్ బంగ్లాను 1939లో నిర్మాణం చేసి, అందులోనే సహజీవనం చేస్తూ,1940లో మిషన్స్ పాఠశాలను ప్రారంభించి, ఎందరో విద్యార్థులను ఉత్తములుగా దీర్చిదిద్దారని, నాటినుండి అట్టిస్థలం సిఎస్ఐ చర్చి ఆధీనంలోనే ఉందంటూ అలనాటి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటున్నారు.

### నాన్చుడు ధోరణిలో అధికార యంత్రాంగం

మండల వ్యాప్తంగా ఉన్న పలు భూవివాద కేసుల్లో సంభందిత అధాకార యంత్రాంగం నాన్చుడు ధోరణి అవలంబిస్తూ, సమస్యను మరింత తీవ్రరూపం దాల్చే దిశగా అధికారుల పనితీరు అద్దం పడుతుందని పలువురు ఆరోపిస్తున్నారు. భూతగాద విషయంలో గత రికార్డులను అనుసరిస్తూ, బాధితుల పక్షాన నిలవాల్సిన సంభంధిత రెవెన్యూశాఖ అధికారులు రికార్డులు లేవంటూ దాటవేయడం సబబు కాదని, రెవెన్యూ శాఖ కార్యాలయంలోనే లేని రికార్డులు ఇతర కార్యాలయంలో ఉంటాయ అని బాధితులు ప్రశ్నల ఝుల్లు కురిపిస్తున్నారు. ఇట్టి రికార్డుల సాధనకు జిల్లా కలెక్టర్, హ్యూమన్ రైట్స్ కమిషన్(హెచ్ఆర్ సి)లను సంప్రదించిన ఫలితం లేదని, రికార్డుల సాధన దేవుడికే తెలియాలని భూవివాద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# ప్రమాద స్థాయికి పారిశ్రామిక కాలుష్యం

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమల నుంచి వెలువడే పొగను శుద్ధి చేయకుండా నేరుగా గాల్లోకి విడుదల చేయడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సాయంత్రం, అర్ధరాత్రి, తెల్లవారుజామున సమయంలో ఘాటు వాసనలు ఎక్కువగా వస్తున్నాయని, ఆ సమయంలో ఊపిరి పీల్చుకోవడమే కష్టమవుతోందని వారు తెలిపారు. పటాన్‌చెరు మాత్రమే కాకుండా పాశమైలారం, బొల్లారం, జీడిమెట్ల, నాచారం,బాలానగర్, కాటేదాన్ వంటి పారిశ్రామిక ప్రాంతాల చుట్టూ కూడా ఇదే పరిస్థితి నెలకొంది. జనావాసాలు పెరగడంతో ఈ పరిశ్రమలు నగర మధ్యలోకి వచ్చి, గాలి నాణ్యతను తీవ్రంగా దెబ్బ తీస్తున్నాయి. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి కాలుష్య నియంత్రణ మండలి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### నిబంధనలకు నీళ్ళు - ఏరులై పారుతున్న పారిశ్రామిక వ్యర్థాలు

సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో పారిశ్రామిక కాలుష్యం తీవ్రస్థాయికి చేరి ప్రజారోగ్యానికి ముప్పుగా మారింది. ఫార్మా, కెమికల్, బల్క్‌డ్రగ్ పరిశ్రమలు నిబంధనలు పాటించకపోవడంతో పర్యావరణం దెబ్బతింటోంది. ఈ ప్రాంతంలో సుమారు 200 పరిశ్రమలు ఉండగా, పటాన్‌చెరు మండలంలోనే 150కు పైగా రెడ్ కేటగిరీ యూనిట్లు పనిచేస్తున్నాయి. ఈ పరిశ్రమల నుంచి రోజూ భారీగా ఉత్పత్తి అయ్యే కాలుష్య జలాలను సామూహిక శుద్ధి కేంద్రం (పీఈటీఎల్)కు పంపాల్సి ఉన్నప్పటికీ, అధిక టిడిఎస్ ఉన్న వ్యర్థాలను రాత్రి వేళల్లో ట్యాంకర్ల ద్వారా నిర్మానుష్య ప్రాంతాల్లో పారబోస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. ఫలితంగా చెరువులు, వాగులు, నదులు కలుషితమవుతూ దుర్వాసన వెదజల్లుతున్నాయి. ఇటీవల హత్నూర మండలం పల్పనూరు సమీపంలో మంజీరా నదిలో కలుషిత జలాల ప్రభావంతో వేల సంఖ్యలో చేపలు మృతిచెందాయి. నీటిలో క్లోరైడ్లు, హెవీ మెటల్స్, క్రోమియం, లెడ్ వంటి ప్రమాదకర రసాయనాలు అధికంగా ఉన్నట్టు గుర్తించారు. బయో ఆక్సిజన్ డిమాండ్, కెమికల్ ఆక్సిజన్ డిమాండ్ స్థాయిలు పెరగడం వల్ల జలజీవుల మనుగడ కష్టమవుతోంది. కాలుష్య జలాల ప్రభావంతో పంటలు దెబ్బతింటుండగా, ఈ నీటిని ఉపయోగించే ప్రజలు, పశువులు చర్మవ్యాధులకు గురవుతున్నారు. భూగర్భ జలాలు కూడా కలుషితమవుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలుష్య నియంత్రణ మండలి టాస్క్‌ఫోర్స్ ఉన్నప్పటికీ, పరిశ్రమలపై కఠిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం కొనసాగుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వర్షాల సమయంలో లేదా ఫిర్యాదుల తర్వాత మాత్రమే తనిఖీలు జరగడం వల్ల అసలు సమస్య బయటపడడం లేదని స్థానికులు అంటున్నారు. ఇస్నాపూర్ పెద్ద చెరువు, నక్కవాగు, మంజీరా నది వంటి జలవనరులు కాలుష్యానికి గురవుతున్నప్పటికీ, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు ఉన్నాయి. గ్రీన్ ట్రిబ్యునల్, కోర్టులు జీరో డిశ్చార్జ్, ఈటీపీలు తప్పనిసరి చేసినప్పటికీ, అమలు లోపిస్తున్నది. పరిశ్రమలు ఆదేశాలను కచ్చితంగా పాటించకపోతే భవిష్యత్తులో తీవ్రమైన పర్యావరణ, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కాలుష్య నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక
బుధవారం । 25 । మార్చి । 2026

# అయ్యా.. నాకు బియ్యం ఇయ్యరా..?

## దేశాయిపేటకు చెందిన జూలూరు భారతమ్మ అధికారులకు వేడుకోలు

**వరంగల్, అక్షిత బ్యూరో:** 75 ఏళ్ల వృద్ధురాలను రేషన్ షాపు నిర్వాహకులు నాకు బియ్యం ఇయ్యడం లేదు దయచేసి నాకు బియ్యం ఇప్పించేందుకు స్థానిక తహసిల్దార్, జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని నాకు బియ్యం వచ్చేలా చర్యలు చేపట్టగలరని అక్షిత బ్యూరో చీఫ్ ను వేడుకున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొ రేషన్ పరిధిలోని 12వ డివి జన్ బాధితురాలు జూలూరి భారతమ్మ తమ ఇంటి నంబరు 22-6-249 కంట్రోల్ దుకాణం నంబరు296 డీలర్ పేరు మన్నె గోపాలరావు కానీ తనకు బియ్యం ఇవ్వడంలో ఇబ్బందులు గురి చేస్తున్నారని తనకు ముగ్గురు కొడుకులు ఒక కూతురు అందరి పెళ్లిళ్లు అయిపోయి అందరూ నిరుద్యోగులే తాను ఒంటరిగానే నివసిస్తున్నప్పటికీ బియ్యం మాత్రమే ఇవ్వడం లేదు.




భర్త పది సంవత్సరాల క్రితమే మరణించగా ఒంటరిగానే నివసిస్తున్నప్పటికీ గత ఐదు సంవత్సరాల నుంచి బియ్యం ఇయ్యడంలో డీలర్లు ఇబ్బందుల గురి చేస్తున్నారని దీనిని ఉన్నతాధికారులు గమనించి తనకు న్యాయం చేసి బియ్యం ఇప్పించాలని జూలూరు భారతమ్మ అధికారులను వేడుకుంటున్నారు. ఉన్నత వర్గాల్లో అన్నీ తెలిసిన వారిలో ఉద్యోగాలు ఉన్న వారికి సైతం మరణించిన వారికి సైతం పెన్షన్లు రేషన్ ఇస్తున్నప్పటికీ బ్రతికి ఉన్న నాకు బియ్యం ఇయ్యడానికి ఈ రకమైన నిర్లక్ష్యం చేయకుండా ఆదుకోవాలని అధికారులను వేడుకుంటుంది.

### తాహసిల్దార్ స్పందన

ఈ సమస్యను స్థానిక వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే పరిశీలించి పరిష్కారం చేస్తామని అక్షిత జాతీయ తెలుగు దినపత్రికకు తెలియజేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

## నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ పథకం కింద మంజూరు చేసిన ఇళ్ళను లబ్ధిదారులు వేగవంతంగా పూర్తి చేసుకునేలా అధికారులు ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని తూడుకుర్తి గ్రామంలో వివిధ లబ్ధిదారులకు చెందిన నిర్మాణం జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్ర మాన్ని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మంగళవారం పరిశీలించారు.

మంజూరైన ఇందిరమ్మ ఇళ్లు వివిధ లబ్ధిదారుల గృహ నిర్మాణ పనులను కలెక్టర్ ప్రత్యక్షంగా సందర్శించి, అక్కడి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని, వచ్చేనెల 20వ తేదీన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల సంక్షేమ కార్యక్ర మంలో భాగంగా గృహ ప్రవేశాల నాటికి పూర్తి చేయాలని అధికారు





లకు కలెక్టర్ ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ఎటువంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ అవసరమని నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటిస్తూ, ప్రతి ఇల్లు సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తూ, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ గృహ నిర్మాణ పథకాన్ని విజయవంతంగా అమలు చేయడం అందరి బాధ్యత అని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకు అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి, నిర్దేశిత గడువులోపు పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. నిర్మాణ స్థాయిల వారీగా జరిగిన పనులకు బిల్లులను మంజూరు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.మొదటి విడత ఇళ్ళ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయించాలని అన్నారు. ఎలాంటి సాంకేతిక ఇబ్బందులు ఉన్నా, వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించి వాటిని పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలన్నారు.

# వ్యాధుల నుంచి పశువుల సంరక్షణే ధ్యేయం

**పెద్ద అడిశర్లపల్లి (గుడిపల్లి), అక్షిత ప్రతినిధి:** గుడిపల్లి మండలంలోని చిలక మర్రి గ్రామంలో మంగళవారం పశువులకు మండల పశు వైద్య సహాయ కురాలు శివనాగమల్లేశ్వరి, సర్పంచ్ దూదిపాల అశ్విని -రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పశువులకి గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేయించారు.



ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల పెంపకదారులు తప్పకుండా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలని వారు కోరారు. పశువుల్లో గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గుతుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర దశరథ, నాగరాజు,ఇరిగి వెంకటయ్య, నీలం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజ మార్గం

## 28న జాతీయ లోక్ అదాలత్ : జిల్లా ఎస్పీ డి.జానకి

**మహబూబ్ నగర్, అక్షిత న్యూస్:** మహబూబ్‌నగర్ జిల్లా ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవా లని జిల్లా ఎస్పీ డి.జానకి పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా, కోర్టుల పరిధిలో ఉన్న వివిధ కేసులను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. తక్కువ ఖర్చుతో, త్వరితగతిన న్యాయం పొందేందుకు ఇది ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 28న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. చిన్న చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ వివాదాలు వంటి అంశాలను లోక్ అదాలత్ ద్వారా సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. కోర్టుల్లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించుకునేందుకు ఈ అవకాశాన్ని వినియోగిం చుకోవాలని జిల్లా ఎస్పీ తెలిపారు.




# క్షయ వ్యాధి నిర్మూలిద్దాం

## ఎస్ వీ కెన్ ఎండ్ టిబి జిల్లా కలెక్టర్

**వరంగల్, అక్షిత బ్యూరో:**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా క్షయ వ్యాధిపై విస్తృత అవగాహన పరీక్షలు చికిత్సలు అందించాలి డాక్టర్ సత్య శారదా దేవి కలెక్టర్ జిల్లా మేజిస్ట్రేట్ వరంగల్.. మంగళవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా క్షయ వ్యాది నిర్మూలనకు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ సికేఎం కాలేజ్ జంక్షన్ నుండి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం దేశాయిపేట వరకు నిర్వహించారు.




ర్యాలీ అనంతరం సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా దేవి విచ్చేసి మాట్లాడుతూ ఈ సంవత్సరం టిబి థీమ్ ఎస్ వీ కెన్ ఎండ్ టిబి క్షయ వ్యాధి ఒక అంటూ వ్యాధి అని ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధిగ్రస్తులకు దూరంగా ఉండి వారి నుండి రక్షణ పొందాలని కోరినారు.క్షయవ్యాధి తగిన సమయంలో గుర్తించినట్లయితే దానికి తగిన చికిత్సలు వైద్యాధికారుల ద్వారా తీసుకోవాలని ప్రజలను కోరినారు.

ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి స్థానిక కార్పొరేటర్లు కావటి కవిత, సురేష్ జోషి, బస్వరాజ్ కుమారస్వామి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు , డిప్యూటీ డిఎండిహెచ్వ డాక్టర్ ప్రకాష్, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, డిప్యూటీ డెమో, క్షయ నియంత్రణ, విద్యార్థులు సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# న్యాయం కోరుతూ గీసుగొండ పోలీస్ స్టేషన్ ముందు బాధితులు ధర్నా

## న్యాయం జరిగే వరకూ పోరాటం ఆగదు

## కుటుంబ సభ్యులు

**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ జిల్లా గీసుగొండ మండలం గొర్రెకుంట గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మాజీ బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు లాదెళ్ల రాజు అనుమానాస్పద మృతికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు గీసుగొండ పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. రాజు మృతి జరిగి ఆరు నెలలు గడిచినా ఇప్పటివరకు పోలీసులు సరైన విచారణ జరపలేదని,కూతురు ల్యాదల్ల శ్రేష్ట రాజ్,కుటుంబం తో పాటు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మృతికి గల అసలు కారణాలు వెల్లడించకపోవడమే కాకుండా ఫోరెన్సిక్ నివేదిక కూడా ఇంకా అందలేదని వారు ఆరోపిస్తున్నారు.

మృతుడి శరీరంపై అనుమానాస్పద గాయాలు ఉన్నప్పటికీ కేసును హత్యగా పరిగణించకపోవడంపై కుటుంబ సభ్యులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. హత్యకు గల కారణాలను వెలికితీసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునే వరకు తమ నిరసన కొనసాగిస్తామని కుటుంబీకులు, గ్రామస్తులు స్పష్టం చేశారు.



# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ హరిత**



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** వైద్యం కొరకు వచ్చేవారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ హరిత అన్నారు. మంగళవారం పెంచికల్ పేట్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బంది హాజరు రిజిస్టరు, మందుల



నిల్వల గదిని ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు వైద్య సిబ్బంది సమయపాలన పాటించి వైద్యం కొరకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. సమయపాలన, అనుమతి, లేకుండా గైర్ హాజరు అయ్యే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించి విద్యార్థుల హాజరు పట్టిక, మెను పట్టిక, సరుకుల నిల్వల గది,వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన రుచికర మైన భోజనాన్ని మెను ప్రకారం పెట్టాలన్నారు. విద్యాలయ పరిసరా లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. విద్యార్థులకు నాణ్యతతో కూడిన బోధనను అందించి, విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధించాలన్నారు. అంతకు ముందు మండలంలోని బొంబాయి గూడా గ్రామంలో గల ఆదర్శ అంగన్వాడి కేంద్రాన్ని, ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. అంగన్వాడి ఉపాధ్యాయురాలిని ఎంతమంది గర్భిణీ స్రీలు వున్నారు. వారిలో డెలివరీకి ఎంతమంది ఉన్నారు. వారికి క్రమం తప్పకుండా పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఉపాధ్యాయురాలిని ఆదేశించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా శ్యాం, మామ్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంపీ యు పి ఎస్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల హాజరు రిజిస్టరును పరిశీలించారు. విద్యార్థులు 100% పాఠశాలకు వచ్చేలా ఉపాధ్యా యులు పర్యవేక్షించాలన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మెను ప్రకారం అందించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే పద్ధతిలో బోధించాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది, అంగన్వాడి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# గ్యాస్ సరఫరాలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**కరీంనగర్ కలెక్టర్ చిత్రా మిశ్రా**

**కరీంనగర్, అక్షిత బ్యూరో:** ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి గ్యాస్ సరఫరా చేయాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పేర్కొన్నారు. నగరంలోని సీతారాంపూర్ లోగల నిర్మల భారత్ గ్యాస్ ఏజెన్సీ గోదాములో మంగళవారం ఆకస్మిక చేశారు. గృహ వినియోగదారుల, వాణిజ్య పరమైన సిలిండర్ల బుకింగ్, స్టాక్ నిల్వలు, రోజు వారీ సరఫరా తదితర వివరాలు ఆరా తీశారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. ఆస్పత్రులకు సరఫరా అవుతున్న సిలిండర్లు, వాణిజ్యప్రదమైన, గృహ అవసరాల సిలిండర్ల సరఫరా వివరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీలర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం గ్యాస్ సరఫరా చేయాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించినా, అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గృహ వినియోగదారులకు సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని




అన్నారు. స్టాక్ నిలువలు, బుకింగ్ సంఖ్య తదితర వివరాలను ఎప్పటి కప్పుడు పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి తెలియజేయాలని డీలర్లకు సూచించారు. కలెక్టర్ వెంట అడిషనల్ కలెక్టర్ లక్ష్మి కిరణ్, జిల్లా పౌరసరఫరాల అధికారి నర్సింగరావు ఉన్నారు.

# అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**గుడ్లు తూకం వేసి పరిశీలన**

**అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులు**

**గర్భిణీలకు అందిస్తున్న పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి,**

**నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,**

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ మండలంలోని తూడుకుర్తి గ్రామ అంగన్వాడీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందిస్తున్న గుడ్లు, బాలామృతం, ఇతర పౌష్టికాహార సామగ్రిని పరిశీలించారు, కాలం చెల్లిన వాటి తేదీలను స్వయంగా చెక్ చేసి, గడువు ముగిసే లోపు వినియోగించు కోవా లని సిబ్బందికి సూచించారు.





కలెక్టర్ గుడ్లను స్వయంగా తూకం వేసి తూకం తక్కువగా ఉన్న గుడ్లను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించవద్దని స్పష్టంగా ఆదేశించారు. వంటగది, వంట సామగ్రిని పరిశీలించి, గర్భిణీలు, చిన్నారులకు అందిస్తున్న ఆహారం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పోషక విలువలు కలిగిన ఆహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

అంగన్వాడీ కేంద్రంలో పిల్లల కోసం ఉన్న ఆట వస్తువులను పరిశీలించిన కలెక్టర్, కేంద్రంలో ఉన్న పిల్లలు, గర్భిణీల సంఖ్యపై ఆరా తీశారు. అవసరమైన ఆట వస్తువులు ఇంకా ఉంటే ఏర్పాటు చేయాలని తెలిపారు. చిన్నారులు చదివి వినిపించిన పద్యాలు, పాటలను కలెక్టర్ ఆసక్తిగా విన్నారు. పిల్లల అభివృద్ధికి విద్యతో పాటు ఆటలు, సృజనాత్మక కార్యకలాపాలు కూడా అవసరమని, అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలు నాణ్యతతో ఉండేలా సిబ్బంది అంకితభావంతో పని చేయాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ పేర్కొన్నారు.

## యాదగిరిగుట్టలో టీజీ ఎస్పీఎఫ్

# సిబ్బంది 10 కిలోమీటర్ల పరుగు

**యాదగిరిగుట్ట, అక్షిత న్యూస్:** టీజీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లాక్రా ఆదేశాలు, కమాండెంట్ ఎన్. త్రినాథ్ సూచనల మేరకు యాదగిరిగుట్ట ఆలయ భద్రతా ఎస్పీఎఫ్ సిబ్బందికి ఈరోజు ఉదయం 10 కిలోమీటర్ల పరుగు నిర్వహించారు. తులసి కాటేజ్ నుండి మల్లాపురం వరకు సాగిన ఈ పరుగులో అధికారులు, సిబ్బంది



ఉత్సాహంగా పాల్గొన్నారు. సిబ్బందిలో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందించడం మరియు భక్తులకు మెరుగైన భద్రత కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ కె. శేషగిరి రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవి, ఏఎస్ఐ లు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాచమార్గం

**జాతీయ మెగా లోక్ అదాలత్‌లో రాజీ ద్వారా కేసులను పరిష్కరించుకోండి : జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్**

**జగిత్యాల, అక్షిత బ్యూరో:** రాజీ మార్గం రాజ మార్గమని, జాతీయ లోక్ అదాలత్‌లో రాజి మార్గం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. ఈనెల 28న నిర్వహించబడనున్న జాతీయ మెగా లోక్ అదాలత్ సందర్భంగా, రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని ఎస్పీ కోరారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కాంపౌండబుల్ కేసులు, సివిల్ వివాదాలు, ఆస్తి విభజన కేసులు, కుటుంబ పరమైన నిర్వహణ కేసులు, వైవాహిక వివాదాలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, చిన్నచిన్న పెట్టి కేసులు మరియు ఇతర రాజీ పడదగిన కేసులను సులభంగా పరిష్కరించుకునే అవకాశం ఉందని తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని, జుడిషియల్ శాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జిల్లా పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే కానిస్టేబుల్‌లు మరియు ఇతర సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాల వారికి కౌన్సెలింగ్ నిర్వహించి రాజీ కుదిరేలా అవగాహన కల్పిస్తారని తెలిపారు. తమ కేసులను రాజీ ద్వారా పరిష్కరించుకోవాలని భావించే వారు సంబంధిత పోలీస్ అధికారులను సంప్రదించాలని, లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన న్యాయం అందుతుందని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.



## జిల్లా ఇన్చార్జి మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ దండేవిట్టల్

**మున్సిపాలిటీ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి...**

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మినిస్టర్ జూపల్లి కృష్ణారావును మంగళవారం హైదరాబాద్లో ఎమ్మెల్సీ దండే విట్టల్, మాజీ మున్సిపల్ చైర్మన్ దస్తగిర్ అహ్మద్ తో పాటు కాంగ్రెస్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా కాగజ్ నగర్ మున్సిపాలిటీలో గల సమస్యల ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమస్యల పరిష్కారం మరియు అభివృద్ధి పనుల కొరకు నిధులు కేటాయించాలని కోరారు. ఈ మేరకు కీళ్ల ఇంచార్జి మంత్రి సానుకూలంగా స్పందించింతలు ఎమ్మెల్సీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్ కాంగ్రెస్ నాయకులు యూసఫ్ ఖాన్ ,కావేటి విజయ్, సూరజ్ మరియు కౌన్సిలర్లు పాల్గొన్నారు.



## ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**కాగజ్‌నగర్, అక్షిత:** కాగజ్ నగర్ పట్టణంలోని ప్రజాలైఫ్ కేర్ ఆసుపత్రిలో మంగళవారం ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ ఉచిత కంటి వైద్య శిబిరానికి వచ్చిన 17 మందిని పరీక్షించగా అందులో 9 మందికి ఆపరేషన్ అవసరమని వారికి విడతల వారిగా ఆపరేషన్ నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ప్రతి మంగళవారం కంటి పరీక్షలు నిర్వహించబడునని, కంటి శుక్లాలు ఉన్నవారు, కంటి చూపు మందగించిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని సిర్పూర్ శాసనసభ్యులు,ఫౌండేషన్ అధ్యక్షులు డా.పాల్వాయి హరీష్ బాబు తెలిపారు.



## ప్రతి వర్షపు బొట్టును ఒడిసి పట్టుకొని నీటిని పొదుపుగా వాడుకోవాలి

**- జిల్లా కలెక్టర్ హరిత**

**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** నీటిని ఇంకించి కరువును జయిస్తేనే మానవాలికి మనుగడ అని ప్రతి వర్షపు బొట్టును ఒడిసి పట్టు కోవాలని కలెక్టర్ హరిత పిలుపునిచ్చారు. మంగళ వారం కాగజ్ నగర్ మండలంలోని జంబుగా గ్రామంలో రైతు వేదికలో భూగర్భ జల శాఖ, సమృద్ధి సొసైటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ప్రపంచ నీటి దినోత్సవం 2026 కార్యక్రమంలో కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా





కలెక్టర్ మాట్లాడుతూ

ప్రపంచంలో ఎన్నో దేశాలు సముద్రపు ఉప్పు నీటిని శుద్ధి చేసుకుని వినియోగిస్తున్నారని కానీ మన దేశంలో బోర్లు, బావులు, చేతి పంపుల ద్వారా వచ్చేశుద్ధమైన నీటిని వినియోగిస్తున్నాం అని తెలిపారు. ప్రతి వర్షపు నీటి బొట్టును ఒడిసి పట్టుకొని సురక్షితమైన భూగర్భ నీటి మట్టాన్ని పెంచాలని వాగులపై చెక్ డ్యాములు, నీటి కుంట లు,బోర్ల సమీపంలో ఇంకుడు గుంతల నిర్మాణం ద్వారా వర్షపు నీరు భూమిలో ఇంకి నీటి మట్టం పెరుగుతుందని

దీని ద్వారా ప్రజలకు సాగు నీరు, త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ఏటా సాధారణ వర్షపాతం కంటే ఎక్కువే నమోదవుతున్న నేపథ్యంలో పుష్కలంగా ఉన్న నీటిని పొదుపుగా వినియోగించుకోక పోవడం, ఇంకించే ప్రయత్నాలు చేయకపోవడం, భూగర్భ నీటిమట్టం పడిపోయి సాగునీటికి, తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు .ప్రజావాణిలో చాలా ధరఖాస్తులు చేతి పంపులు మంజూరు చేయాలని వస్తుంటాయని తెలిపారు. భూగర్భ నీటిమట్టం పెరగాలంటే ప్రతి ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణాలు చేపట్టాలని కలెక్టర్ అన్నారు. ఒకప్పుడు ఇంట్లో అవసరా లకు మహిళలు చాలా దూరం నుండి నీటిని తీసుకు వచ్చేవారని, కానీ నేడు ప్రభుత్వం ఇంటింటికి శుద్ధ జలాన్ని అందిస్తుందని, వాటిని సక్రమంగా విని యోగించుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతును సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా భూగర్భ నీటి వనరుల శాఖ అధికారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకట్, ఉద్యానవన శాఖ అధికారి నదిశ్, ఇ.ఇ మిషన్ భగీరథ సిద్ధిక్, ఫిషరీన్ ఏడి సాంబశివరావు ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖలో
# పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

**-జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి డాక్టర్ విజేత వేల్పుల**



**ఖమ్మం/ అక్షిత బ్యూరో:** మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఖమ్మం జిల్లాలో సఖి డిహెచ్ఈ డబ్ల్యు ఎస్ఏఐ కేంద్రాలలో ఖాళీగా ఉన్న పోస్టులను ఔట్‌సోర్సింగ్ విధానంలో భర్తీ చేయుటకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ అధికారిణి డాక్టర్ విజేత వేల్పుల తెలిపారు.అర్హత గల మహిళా అభ్యర్థులు తమ దరఖాస్తులను పూర్తి వివరాలతో సంబం ధిత ధృవపత్రాల నకలుతో పాటు సమర్పించవలెను. సంబంధిత అర్హతలు నిబంధనలు మరియు ఇతర వివరాలు 31.03.2026 లోపు జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ కార్యాలయం ఖమ్మం (ఎస్ -31 కోర్ట్ కాంప్లెక్స్) వద్ద ధరఖాస్తులు సమర్పించవలెను. పూర్తి వివరాలు కోసం జిల్లా వెబ్‌సైట్ ఖమ్మం.తెలంగాణ.గవర్నమెంట్.ఇన్ ను సందర్శించవచ్చు.

**ఖాళీల వివరాలు**

**సైకో సోసియల్ కౌన్సిలర్ - 01 పోస్టు**

**అర్హత:** సైకాలజీ / న్యూరోసైన్సెస్‌లో డిగ్రీ / డిప్లొమా.మహిళలై ఉండాలి.సంబంధిత రంగంలో ప్రభుత్వ / ప్రభుత్వేతర సంస్థలలో కనీసం (8) సంవత్సరాల అనుభవం ఉండాలి.స్త్రీ శిశు సంక్షేమ శాఖ లో పని చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుంది.

**వయస్సు:** 21-45 సంవత్సరాలు (01.07.2026 నాటికి 21 నుండి 45 లోపు ఉండాలి)

**మల్టీపర్పస్ స్టాఫ్ /కుక్ - 01 పోస్టు**

అర్హత: టెన్త్ ఉత్తీర్ణత. సంబంధిత పనిలో (5) సంవత్సరాల అనుభవం ఉండాలి.

వయస్సు: 21-45 సంవత్సరాలు (01.07.2026 నాటికి 21 నుండి 45 లోపు ఉండాలి)

**జెండర్ స్పెషలిస్ట్ - 01 పోస్టు**

అర్హత: సోషల్ వర్క్ లేదా ఇతర సామాజిక శాస్త్రాలలో డిగ్రీ / పీజీ చేసిన మహిళలై ఉండాలి... పీజీ చేసిన వారికి ప్రాధాన్యత. సంబంధిత రంగంలో కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలి.

వయస్సు: 21-45 సంవత్సరాలు (01.07.2026 నాటికి 21 నుండి 45 లోపు ఉండాలి)

**ఆయా - 01 పోస్టు**

అర్హత: 6 సంవత్సరాల లోపు పిల్లల సంరక్షణలో అనుభవం, 10వ తరగతి లేదా ఇంటర్మీడియట్ విద్యార్హత ఉన్న మహిళలై ఉండాలి.

వయస్సు: 25-50 సంవత్సరాలు (01.07.2026 నాటికి 25 నుండి 50 లోపు ఉండాలి)

**గమనికలు**

1. ఈ శాఖ యందు అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును.
2. ఈ పోస్టులు పూర్తిగా ఒప్పంద పద్ధతిలో భర్తీ చేయబడును.
3. ఎంపిక ప్రక్రియ జిల్లా స్థాయి సెలక్షన్ కమిటీ ద్వారా జరుగుతుంది. అర్హత గల అభ్యర్థినులు నిబంధనలకు అనుగుణంగా ఎంపిక చేయబడతారు.
4. అసంపూర్ణ ధరఖాస్తులు ఆలస్యంగా వచ్చిన ధరఖాస్తులు స్వీకరించబడవు
5. సెలక్షన్ కమిటీ నిర్ణయం తుది నిర్ణయం. 6. సెలవు దినములలో దరఖాస్తులు స్వీకరించబడవు.

# తుడుకుర్తి పీహెచ్‌సీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి**

**ఆసుపత్రుల్లో అన్ని మందులు అందుబాటులో ఉండాలి**

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్**



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకాన్ని పెంపొందించాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, సూచించారు.

మంగళవారం జిల్లా కలెక్టర్ నాగర్ కర్నూల్ నియోజకవర్గం పరిధిలో ని తుడుకుర్తి గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రిసెప్షన్ సెంటర్, ఇన్‌పేషెంట్ విభాగం, జనరల్ వార్డులు, ఫార్మసీ, ల్యాబ్ తదితర విభాగాలను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకుని, అటెండెన్స్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంతమంది రోగులు వస్తున్నారు, స్థానికంగానే ప్రసవాలు జరుగుతున్నాయా అనే విషయాలపై సిబ్బందిని జిల్లా కలెక్టర్ ప్రశ్నించారు, సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని, గర్భిణీలకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యతపై సమీక్ష చేసి, అవసరమైన సూచనలు ఇచ్చారు. అన్ని రకాల ఔషధాలు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెంచేందుకు అంకితభావంతో పని చేయాలని సిబ్బందిని కలెక్టర్ సూచించారు.

అనంతరం అదే ప్రాంగణంలో నిర్మాణంలో ఉన్న నూతన ఆసుపత్రి భవనాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని సమీక్షిస్తూ, భవనం నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు.

ఆసుపత్రి భవనం పనులను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. భవిష్యత్తులో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ఈ ఆసుపత్రి కీలకంగా మారనున్నందున, ఎటువంటి లోపాలు లేకుండా పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

# గిరిజనులపై ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యాల అరికట్టాలి

**సిపిఐ ఎమ్ ఎల్ మాస్ లైన్**



**సత్తుపల్లి, అక్షితన్యూస్:** గుడిపాడులో దాదాపుగా 20 సంవత్సరాల నుంచి పేద గిరిజనులు సాగు చేసుకుంటున్న పోడు భూములలో ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా ట్రెంచ్ కొట్టడాన్ని అడ్డుకున్న గిరిజన మహిళలపై దాడి చేయడాన్ని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి ఏ.వెంకన్న ,జిల్లా నాయకులు గంట శ్రీనివాసరావు, డివిజన్ నాయకులు అమర్లపూడి శరత్, మండల కార్యదర్శి తాటిరాజు తీవ్రంగా ఖండించారు. కాకర్లపల్లి బీట్‌లో 85 ఎకరాలు గిరిజనులు సాగుచేసుకుంటూ నిరంతరం వాళ్ళజీవనశైలి గడుపుతున్నారు. గత ప్రభుత్వం పోడు భూములకు పట్టాలు ఇస్తామని సర్వే నిర్వహించి గుడిపాడు గిరిజనులు సాగు చేసుకుంటున్న 85 ఎకరాలలో 60 ఎకరాలకు పట్టాలి ఇచ్చి మిగిలిన 25 ఎకరాలకు పట్టాలి ఇవ్వకుండా వాళ్లపై అక్రమంగా కేసులు పెట్టి నిరంతరం వాళ్ళను కోర్టు చుట్టూ తిప్పడం జరుగుతుందని అన్నారు. గత వారం రోజుల నుంచి గుడిపాడు పోడులో ఫారెస్ట్ వాళ్ళకి గిరిజనులకి నిరంతరం ఘర్షణలు జరుగుతూనే ఉన్నాయని మంగళవారం ట్రెంచ్ తీయటానికి వచ్చిన జెసిబిని అడ్డుకున్న గిరిజనులపై ఫారెస్ట్ సిబ్బంది అక్రమంగా దౌర్జన్యంగా దాడులు జరిపి గిరిజన మహిళ అయిన మట్ట రంగమ్మను గాయ పరచడం జరిగిందని అన్నారు.గిరిజన మహిళలపై జరిగిన ఫారెస్ట్ అక్రమ దాడులను ప్రజలు ప్రజాస్వామిక వాదులు ఖండించాలని కోరారు.

అక్షిత — People's voice — AKSHITHA NATIONAL DAILY — జాతీయ దినపత్రిక — www.aakshitha.com

బుధవారం । 25 । మార్చి । 2026

# క్షయ వ్యాధిని ముందుగా గుర్తిస్తే నయం చేయవచ్చు

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

**మందమర్రి, అక్షిత ప్రతినిధి:** క్షయ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించినట్లయితే నయం చేయవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం టి. బి. ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని మందమర్రి మండలం అందుగులపేట గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్ రావు, ఉప జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సుధాకర్ నాయక్ అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ క్షయ వ్యాధి లక్షణాలను ముందుగా గుర్తించినట్లయితే నయం చేయవచ్చని తెలిపారు. 100 రోజుల పాటు క్షయ వ్యాధి నియంత్రణలో భాగంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, తెమడ పరీక్ష, ఎక్స్ రే తీసుకోవడం ద్వారా క్షయ వ్యాధిని గుర్తించవచ్చని, సరైన సమయంలో చికిత్స అందించినట్లయితే పూర్తిగా నివారించే అవకాశం ఉంటుందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీల పరిధిలో పరీక్షలు, చికిత్స, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు అయినట్లయితే వ్యాధి నివారణ మరింత సులభతరం అవుతుందని తెలిపారు. క్షయ ప్రభావిత ప్రాంతాలలో 14 సంవత్సరాల పైబడిన వారందరికీ పరీక్షలు చేయడం జరుగుతుందని, మధుమేహం, రక్తపోటు, రక్తహీనత, పోషకాహార లోపం, క్యాన్సర్ వంటి అసంక్రమణ వ్యాధులను గుర్తించడం ద్వారా క్షయ వ్యాధిని ముందుగానే గుర్తించి చికిత్స చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సకాలంలో పౌష్టిక ఆహారం తీసుకోవడం ద్వారా శరీరంలో రోగ నిరోధక శక్తి పెంపొందించుకోవచ్చని, ప్రజలు సొంత ఆలోచనతో మందులు వినియోగించకూడదని, ప్రజల సౌకర్యార్థం జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖాన, పల్లె దవాఖాన, ప్రభుత్వ సాధారణ ఆసుపత్రులు, ప్రభుత్వ వైద్య కళాశాల ద్వారా ఉచితంగా సేవలు అందించడం జరుగుతుందని, వైద్యుల సలహా మేరకు మాత్రమే మందులు వినియోగించాలని తెలిపారు. క్షయ వ్యాధి నివారణలో భాగంగా ఆరోగ్య ఉపకేంద్రాల వైద్యులు, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ అందించడం జరిగిందని తెలిపారు. వ్యాధి పూర్తిగా నయం అయ్యేవరకు తప్పనిసరిగా వైద్యుల సూచన ప్రకారం మందులను వినియోగించాలని, వ్యాధి నయం అయిన తరువాత వైద్య పరీక్షల నివేదిక అనంతరం వైద్యుల సూచన మేరకు మాత్రమే మందుల వినియోగం ఆపాలని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు కీలు ఫౌండేషన్ ద్వారా డా. రాజ్ కిరణ్ సంస్థ ద్వారా న్యూట్రిషన్ కిట్లను అందించడం జరిగిందని, ఈ కిట్లు వినియోగించడం ద్వారా వ్యాధిని ఎదుర్కొనవచ్చని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం నిశ్చయ భూషణ్ యోజన క్రింద ప్రతి నెల 1 వేయి రూపాయలు పోషణ మధ్యము చికిత్స కాలం వరకు అందించడం జరుగుతుందని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గిన, తుమ్మిన క్షయ క్రిములు బయటకు వస్తాయని, మాస్క్ ధరించినట్లయితే నియంత్రించవచ్చని, సాధ్యమైనంత వరకు గాలి, వెలుతురు ఉన్న ప్రాంతాలలో ఉండాలని తెలిపారు. జిల్లాలో 759 మంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్సలు అందించడం జరుగుతుందని, పోషకాహారం కోసం డి బి టి ద్వారా 150 మంది రోగులకు 6 వేల రూపాయల చొప్పున పోషకాహారం కోసం అందిం



చడం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో ప్రజలలో వ్యాధి నివారణ పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి వ్యాధిగ్రస్తులను తొందరగా గుర్తించడం, సమయానికి మందులు అందించడం జరుగుతుందని, జిల్లాలోని రోగులకు పోషకాహారం అందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందని, క్షయ వ్యాధి రహిత జిల్లాగా మంచిర్యాలను తీర్చిదిద్దుదామని తెలిపారు. అనంతరం ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఆరోగ్య సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం పొన్నారం గ్రామంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్ తో కలిసి ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించి లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించి నిబంధనల ప్రకారం ఇండ్లు నిర్మించుకునేలా వివరించాలని, పనులు త్వరగా పూర్తిచేసేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, అంతర్గత రహదారులు, మురుగు కాలువల వ్యవస్థను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించాలని తెలిపారు. గ్రామంలో నర్సరీని సందర్శించి వేసవి అయినందున సకాలంలో నీటిని అందించి మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల తహసిల్దార్ సతీష్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజేశ్వర్, వైద్యాధికారులు డా. అరుణ శ్రీ, డా. రమేష్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సి పి ఓ లు, ఆశ, ఆరోగ్య కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నగర అభివృద్ధి మా ప్రధాన ధ్యేయం

**- మేయర్ కోలగాని శ్రీనివాస్**



**కరీంనగర్, అక్షిత బ్యూరో:** కరీంనగర్ నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ పాలకవర్గం ప్రధాన లక్ష్యమని నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా మేయర్ మంగళవారం నగరంలో పర్యటించారు. మొదటగా 44 వ డివిజన్ సప్తగిరికాలనీ కస్తూరిభా గాంధీ ప్రభుత్వ పాఠశాలలో స్థానిక కార్పోరేటర్ చాడగొండ కవిత బుచ్చిరెడ్డితో కలిసి 38 లక్షల నాభార్డ్ నిధులతో సైన్స్ ల్యాబ్ నిర్మాణంకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. అనంతరం 49 వ డివిజన్ సంతోష్ నగర్ లో కార్పోరేటర్ ఎన్నం లక్ష్మీ ప్రకాష్ తో కలిసి సంతోషిమాత దేవాలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సంతోష్ నగర్ కాలనీలో రోడ్డు, డ్రైనేజీ సమస్యలను తనిఖీ చేసి పరిశీలించి సంతోష్ నగర్ రోడ్డు సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భాగ్యనగర్ కాలనీలో 15 వ ఆర్థిక సంఘం 4 లక్షల నిధులతో మంచి నీటి సరఫరా పైపులైన్ అభివృద్ధి పనులకు భూమీ పూజ చేసి పనులు ప్రారంభం చేశారు. చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీస్కోవాలని అధికారులు, కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సంధర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా మా పాలకవర్గం పని చేస్తుందన్నారు. శివారు ప్రాంతాల,విలీన గ్రామాల డివిజన్లు ప్రాధాన్యతగా అభివృద్ధి చేస్తామని తెలిపారు. 66 డివిజన్లలో ప్రజా సమస్యలను దశలవారీగా పరిష్కరించి వసతి సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో అధునీకరణ పనులు చెపట్టి విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించామని తెలిపారు. అధునిక విద్యా బోధన అందించే విధంగా పలు ప్రభుత్వ పాఠశాలలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో స్మార్ట్ ఈ క్లాస్ రూంలు ఏర్పాటు చేశామని తెలిపారు. సప్తగిరి ప్రభుత్వ పాఠశాలలో కూడ విద్యార్థులకు వసతి సౌకర్యాలు కల్పించడంతో పాటు వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ము ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కస్తూరిభా గాంధీ పాఠశాల విద్యార్థుల కోసం నాభార్డుకు చెందిన 38 లక్షల నిధులతో సైన్స్ ల్యాబ్ భవన నిర్మాణం పనులకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. అంతే కాకుండా 49 వ డివిజన్ భాగ్యనగర్ లో ప్రజలకు త్రాగు నీటి సౌకర్యం కల్పించేందుకు నూతనంగా మంచి నీటి పైపులైన్ అభివృద్ధి పనులను ప్రారంభం చేశామని తెలిపారు. మా పాలకవర్గంలో దశలవారీగా డివిజన్లలో ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ నగరాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కార్పోరేటర్లు బండ రమణారెడ్డి, కర్రె పద్మ అనిల్, గాజ రమ శివరాం, డీఈ శ్రీనివాస్, ఏఈలు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




# తడి పొడి చెత్త నిర్వహణపై విద్యార్థులకు అవగాహన

**యాదాద్రి భువనగిరి అక్షిత న్యూస్:** గంగసానిపల్లి ముత్తిరెడ్డిగూడెం గ్రామం నందు తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ క్షేత్ర పర్యటన ప్రోగ్రాంలో భాగంగా ఘన వ్యర్థాలను వేరు చేయు విధానంపై వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ కళాశాల విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అలాగే ముత్తిరెడ్డిగూడెం లో ఉన్న ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని సందర్శించారు. తడి, పొడి చెత్త వేరు చేయడం కంపోస్టు




ఎరువు తయారీ విధానాన్ని ముఖ్య అతిథులుగా వచ్చిన టి. ఎన్. జి. సి కోఆర్డినేటర్ సూర్య కిరణ్, వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మరియు స్వచ్ఛ భారత్ మిషన్ ఎస్.బి.ఎమ్. జిల్లా కోఆర్డినేటర్ మిర్యాల మురళి ఎకో- క్లబ్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొని వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని సూచిస్తూనే తడి చెత్తను పొడి చెత్తను తమ దైనందిన జీవితంలో అనుసరిస్తూ ముందుకెళ్లాలని వివరించారు. ముత్తిరెడ్డిగూడెం సర్పంచ్ రాంపల్లి కృష్ణ ఉప సర్పంచ్ అందే మల్లేష్ లు హాజరై గ్రామ తడి పొడి చెత్తను ఏ విధంగా వేరు చేయాలో మన దైనందిన జీవితంలో దానిని ఏ విధంగా అనువదించుకోవాలో వివరించడం జరిగింది. వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ నేషనల్ గ్రీన్ క్రాప్స్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్మెంట్ ఎడ్యుకేషన్ క్షేత్ర పర్యటన ప్రోగ్రాంలో భాగంగా, ఈకో క్లబ్ లో భాగంగా ఈ రోజు మా వాత్సల్య కళాశాల విద్యార్థులు పాల్గొని అవగాహన చేసుకున్నారని, మా విద్యార్థులు నలుగురికి మార్గదర్శులుగా అవుతారని హామీ ఇచ్చారు. విద్యతోపాటు ఇలాంటి కార్యక్రమాలు చేసినప్పుడే విద్యార్థులలో నైపుణ్యం పెరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వాత్సల్య కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు ప్రభాకర్, మాధవి, శ్రీశైలం, అంజయ్య, రమేష్, శ్రీనివాస్, ముత్తిరెడ్డిగూడెం సర్పంచ్ రాంపల్లి కృష్ణ ఉప సర్పంచ్ అందే మల్లేష్ ,వార్డ్ సభ్యులు జక్కుల మల్లేష్, కొండమడుగు అశోక్, ముత్తిరెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి కంచుగల్ల కృష్ణయ్య తోపాటు ఫీల్డ్ అసిస్టెంట్ పల్లెర్ల కుమార్ మరియు వాత్సల్య కళాశాల విద్యార్థిని విద్యార్థులు, గ్రామ పంచాయతీ సిబ్బంది మొదలైన వారు పాల్గొని తడి చెత్త పొడి చెత్త ఫీల్డ్ ట్రిప్ ను విజయవంతం చేశారు.

# సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్య, పల్లగొర్ల మోదీరాందేవ్

**యాదాద్రి భువనగిరి, అక్షిత న్యూస్:** అసెంబ్లీ సీఎం ఛాంబర్ లో సీఎం రేవంత్ రెడ్డి కలిసిన బీసీ జేఏసీ చైర్మన్ రాజ్యసభ ఎంపీ ఆర్ కృష్ణయ్యబీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్,పలు విషయాలపై వినతిపత్రం ఇవ్వడం జరిగింది. బీసీ రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, విద్యార్థులకు రావలసిన ఫీజు బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగ



సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఉద్యోగస్తులు రిటైర్డ్ ఉద్యోగస్తుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర రైతాంగ సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డి వివరించడం జరిగింది. రాజ్యసభ ఎంపీఆర్ కృష్ణయ్య ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్, నీలా వెంకటేష్, జిల్లపెల్లి అంజి, పి సతీష్, పాల్గొన్నారు

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY
జాతీయ దినపత్రిక



## ఈనెల 30న భువనగిరిలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్క్ షాప్‌ను జయప్రదం చేయండి

**- కొండమడుగు నర్సింహ్మా**

**యాదాద్రి భువనగిరి, అక్షిత న్యూస్:** ఈనెల 30వ తేదీన సుందరయ్య భవన్, భువనగిరిలో నిర్వహిస్తున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా వర్క్ షాప్ ను సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం




చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ ఒక ప్రకటన ద్వారా తెలియజేసినారు. వామపక్ష పార్టీలు, వ్యవసాయ కార్మిక సంఘాలు అనేక పోరాటాల ఫలితంగా 2005 సాదించుకున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని మోడీ బిజెపి ప్రభుత్వం ఎత్తివేసి విబి - జి రామ్ జి చట్టాన్ని తీసుకొచ్చి కూలీల పొట్టలు కొట్టాలని చూస్తున్నారని విమర్శించారు. ప్రతి బడ్జెట్ లో నిధులు తగ్గిస్తు కొత్త కొత్త జీఓలు తెచ్చి కూలీల సంఖ్య తగ్గిస్తూ చేసిన పనికి వారమారం డబ్బులు ఇవ్వకుండా, పని ప్రదేశాల్లో మౌలిక వసతులు తగ్గిస్తూ చట్టంలో ఉన్న హక్కులను కూడా తొలగించారని విమర్శించారు. ప్రధానంగా ఈ వర్క్ షాప్ లో పాత ఉపాధి హామీని కొనసాగించాలని, నూతన చట్టాన్ని రద్దు చేయాలని, భూ సమస్యలను పరిష్కరించాలని ఏప్రిల్ 1 నుండి మే 15 వరకు గ్రామ గ్రామాన పర్యటనలు చేసి వ్యవసాయ కూలీలను, ఉపాధిహామీ కార్మికులను కదిలించి ఉద్యమాలు చేపట్టడానికి పోరాట కర్తవ్యాలను రూపొందిస్తామని తెలిపారు. ఈ వర్క్ షాప్ కు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి. నాగయ్య, ఆర్. వెంకట్రాములు ముఖ్యఅతిథిగా హాజరవుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం మండల, జిల్లా నాయకత్వం అధిక సంఖ్యలో పాల్గొని వర్క్ షాప్ ను జయప్రదం చేయాలని నర్సింహ కోరినారు.

## కొత్త హామీలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**దాసరిపాండు సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు**

**యాదాద్రి భువనగిరి, అక్షిత న్యూస్:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయక కొత్త హామీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు అన్నారు. ఈ రోజున ఇంటింటి సిపిఎం పార్టీలో కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు మండల కేంద్రంలో ఇంటింటి సిపిఎం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన



హామీలు రేషన్ కార్డులో అన్ని రకాల పెన్షన్లు పెంచుతామనిరైతు రుణమాఫీ రైతు బంధు మహిళలకు డబ్బులు ఇస్తామని చెప్పిన హామీలు అమలు చేయకపోగా బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయడానికి బడ్జెట్ కేటాయించకుండా కొత్త పథకాలు అమలు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు హామీలు చేయకుండా మూసి సుందరీ కరణ పేరుతో నూతన విద్యా విధానం ప్రైమరీ స్కూల్ పేరుతో విద్యను నాణ్యమైన విద్యను అందిస్తూ మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తామని రైతులకు రుణమాఫీ చేస్తామని హైదరాబాదు చుట్టూ రోడ్లు ఏర్పాటు చేసి హైదరాబాదు నగరాన్ని అభివృద్ధి చేస్తామని అనేక పథకాలు అమలు చేస్తామని చెప్పడం తప్పుతుంది కానీ గ్రామాల్లో ఉన్న రైతులకు ఉపయోగపడే భూ నాది గాని కాలువ పూర్తి చేయడం కోసం కాలువలో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించడంలో కాలువలు పూర్తి చేసి రైతులకు నీళ్లు అందించడంలో ఈ ప్రభుత్వానికి శక్తశుద్ధి లేదని అమలు కానీ హామీలను పక్కనపెట్టి ప్రజా సమస్యల చేయాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వేముల భిక్షం సీనియర్ నాయకులు రచ్చ గోవర్ధన్ మండల కమిటీ సభ్యులు రాసమల్ల సత్తయ్య తుమ్మల సత్యనారాయణ రెడ్డి మల్లెల శ్రీశైలం ఏపూరి బుగ్గ రాములు భాష బోయిన రాములుతదితరులు పాల్గొన్నారు.

# తొలితరం ఆంగ్ల బోధన పాఠశాలగా పేరొందిన నెహ్రూ మెమోరియల్ స్మారక పాఠశాల

**కళ్ళముందే ప్రజల ఆస్తి కనుమరుగయ్యే పరిస్థితులు**

**పేద ప్రజల విద్యా అవకాశాలు కాపాడడంలో నిర్లక్ష్యం వహిస్తున్న పాలక పక్షం, అధికార గణం**

**చూసి చూడనట్లు వ్యవహరిస్తున్న పాలకులు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసి ప్రైవేట్ వ్యక్తులకు దారా దత్తం చేయడంలో ఆసక్తి**




**వరంగల్, అక్షిత బ్యూరో:**

దేశాయిపేటలో 1960 ప్రాంతంలో ప్రభుత్వ స్థలంలో స్వచ్ఛంద సంస్థలైన ఇన్నర్ వీల్, రోటరీ, చాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తంగా మొదటి పాఠశాల సముదాయం నిర్మించి ప్రభుత్వ ఎయిడెడ్ నెహ్రూ మెమోరియల్ స్కూల్ గా పాఠశాలగా 2025 వరకు నిరంతరాయంగా కొనసాగించి ప్రభుత్వం ఎయిడెడ్ ఉపాధ్యాయులను నియమించని కారణంగా 2025 చివరన పాఠశాలను మూసి వేయడం జరిగింది. గతంలో విద్యాశాఖ అధికారుల సమన్వయంతో కొంతమంది ఉపాధ్యాయులను డిప్యూటేషన్ వేసినప్పటికీ యాజమాన్యం ఆసక్తి చూపకపోవడంతో ఉపాధ్యాయులను నియమించకుండా పాఠశాల మూసివేత దిశకు చేరుకున్నది.

### ఎంతో మందిని ఉన్నత శిఖరాలకు చేర్చిన తొలి తరం పాఠశాల

తొలితరం ఇంగ్లీష్ పాఠశాలల్లో ప్రధానమైనది నెహ్రూ మెమోరియల్ గవర్నమెంట్ ఎయిడెడ్ పాఠశాల ఎంతోమంది మేధావులు, విద్యావంతులు వైద్యులు ప్రజాప్రతినిధులు చివరకు వ్యక్తులను తీర్చిదిద్దిన నెహ్రూ మెమోరియల్ పాఠశాల దేశాయిపేట పైడిపల్లి ఉరుసు కరీంబాద్ రంశయ్యపేట కాశిబుగ్గ ఖిలా వరంగల్ హనుమకొండ బాలసముద్రం వంగపహాడ్ ఆరెపల్లి వంటి ప్రాంతాల నుంచి సుమారు 1000 నుంచి 1200 మంది విద్యార్థులను అనునిత్యం రెండు బస్సులు స్థానిక ప్రయాణ సాధనాల ద్వారా విద్యాబుద్ధులు నేర్పించిన తొలితరం ఇంగ్లీష్ మీడియం పాఠశాల.

### పట్టింపు లేని అధికారులు

ఇటీవల దేశయిపేట ప్రభుత్వ పాఠశాలలో బోరు పాడై పది రోజులు అయింది. కానీ మండల విద్యాశాఖ అధికారి జిల్లా విద్యాశాఖ అధికారి పాఠశాల నిర్వహకులు దానీని పూర్తిస్థాయిలో బాగు చేయక స్థానిక నగరపాలక సంస్థ వాటర్ ట్యాంకర్ ద్వారా నీళ్లు తెప్పించుకుంటూ తాత్కాలిక ఏర్పాటు చేస్తున్న ఉపాధ్యాయ బృందం. కానీ స్థానిక ప్రజాప్రతినిధుల ద్వారా పక్క డివిజన్లో ప్రజాప్రతినిధులు సేవ చేస్తున్న పట్టించుకోని జిల్లా యంత్రాంగం కనీసం నీటి వసతి ఏర్పాటు చేయలేని ఆ శాఖలు తమ విధులు నిర్వర్తించే ప్రయోజనం ఏమిటి పిల్లలకు చేతులు కడుక్కునేందుకు నీటి వినియోగం కోసం ఏర్పాటు చేయలేని ఈ పాలక పక్షాలు ఏం సౌకర్యాలు అందిస్తున్నట్టు ప్రభుత్వ సేవలు అంటే ఇది కాదా? ఇంకే రకమైన సేవలు చేస్తారో అధికారులే తేల్చుకోవాలి.

ఇటువంటి సందర్భాల్లో ఆయా పాఠశాలల పనితీరు మెరుగుపరిచేందుకు జిల్లా అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలి అంతేతప్ప అన్ని సక్రమంగా నడుస్తున్న వాటిని ముందస్తుగా సమాచారం అందించి వాటిని పరిశీలించడం ద్వారా సమాజానికి ఏ రకమైన సందేశం ఇస్తున్నట్లు అధికారులే పరిశీలించుకోవాలి.

### కూలే దశలో దేశయిపేట ప్రభుత్వ పాఠశాల

శిథిలావస్థలో చేరి కూలేందుకు సిద్ధంగా ఉన్న దేశాయిపేట ప్రభుత్వ పాఠశాల ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించని జిల్లా యంత్రాంగం పట్టించుకోని ప్రజాప్రతినిధులు ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణ నష్టం జరిగే అవకాశాలు ఉన్నాయి కానీ జిల్లా విద్యాశాఖ అధికారులు గాని జిల్లా ఉన్నతాధికారులు గాని దీనిని పట్టించుకోవడం లేదు అనేకమార్లు మంత్రి దృష్టికి తీసుకువెళ్లిన గతంలో పనిచేసిన శాసనసభ్యుల దృష్టికి తీసుకువెళ్లిన సమస్యగానే ఉన్నది. దేశాయిపేటలో ఇటీవలే మూతపడిన నెహ్రూ మెమోరియల్ స్మారక పాఠశాలను ఎయిడెడ్ పాఠశాల కాబట్టి ప్రభుత్వం వీరికి టీచర్లను కేటాయించకపోవడం వలన పాఠశాల మూసివేత దిశకు చేరుకుని అందులో ఉన్న 12 మంది పిల్లల్ని దగ్గర ఉన్న పాఠశాలలో చేర్పించి పాఠశాలకు తాళం వేసినారు.

### ప్రజల ఆస్తులను కాపాడాలి

ఇప్పుడు కూలేందుకు సిద్ధంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను ప్రాథమిక లేదా ఉన్నత పాఠశాలను నెహ్రూ మెమోరియల్ స్కూలుకు మార్చి ప్రభుత్వ ఆస్తిని దక్కించుకొని ప్రజలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవలసిన ప్రజా ప్రతినిధులు పాలకవర్గాలు ఉన్నతాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ సమస్యలు ఎన్నిసార్లు ప్రస్తావించినా వాటి జోలికి వెళ్లకుండా కేవలం తూతూ మంత్రంగా అధికారిక కార్యక్రమాలు ప్రణాళికను సిద్ధం చేసుకుని తమకు అవసరమున్న ప్రజలకు అవసరం లేని కార్యక్రమాలు తమ ప్రణాళికల్లో పొందుపరచుకొని వాటిని అమలు చేసుకునేందుకు ప్రైవేట్ వ్యక్తులకు ప్రభుత్వ ఆస్తులు దారా దత్తం చేసేందుకు మాత్రమే కార్యక్రమాలు రూపొందించుకుంటున్నారు. వెంటనే దేశాయిపేటలో ఇటీవల మూసివేతకు సిద్ధమైన నెహ్రూ మెమో రియల్ స్మారక పాఠశాలను దశపేట ప్రభుత్వ పాఠశాలకు అప్పగించి విద్యార్థులను ప్రభుత్వ ఆస్తిని కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. లేనట్లయితే ప్రభుత్వ స్థలం కబ్జా గుర్రై ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి రాజకీయ నాయ కులు అండదండలతో చేతులు మారే అవకాశాలు కనిపిస్తున్నాయని స్థానికులు బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

# కార్మికుల సంక్షేమమే ఐఎన్టీయూసీ ధ్యేయం

**ఐఎన్టీయూసీ నాయకులు తీగల క్రాంతి కుమార్, కోటేశ్వరరావు**

**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** స్థానిక సత్తుపల్లి పట్టణం సింగరేణి లో తెలంగాణ రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ , ఐఎన్టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ ఆదేశాల మేరకు సత్తుపల్లి క్యాంప్ కార్యాలయంలో ఏరియా వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు అధ్య క్షతన ఐఎన్టీయూసీ యూనియన్ అత్యవసర సమావేశం నిర్వహిం చారు. ముఖ్య అతిథిగా ఐఎన్టీ యూసీ జాయింట్ జనరల్ సెక్రెటరీ తీగల క్రాంతికుమార్ పాల్గొన్నారు. తీగల క్రాంతి కుమార్ మాట్లాడుతూ భూపాలపల్లి లో జరిగిన సమావేశంలో స్వయంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సింగరేణి కార్మికుల సమస్యలపై మెడికల్ బోర్డు నిలిపివేత అంశంపై స్పందించి బోర్డు నిలిపి వేయలేదని చెప్పినప్పటికీ సింగరేణి యాజమాన్యంతో మాట్లాడి పునరుద్ధరణ చేయించలేని స్థితిలో ఉన్నగుర్తింపుసంఘంఏ.ఐ.టి.యు.సి యూనియన్ పూర్తిగా వైఫల్యం చెందిందని ,ఎన్నికల్లోఏ.ఐ.టి.యు.సి కార్మికులకు అనేక హామీలు సాధిస్తామని మభ్యపెట్టి గుర్తింపు సంఘంగాగెలిచారని విమర్శించారు. గుర్తింపు సంఘంగా గెలిచిన నాటినుండి ఏ.ఐ.టి. యు.సి ఏ ఒక్క హామీనికూడానెరవేర్చకుండా కార్మికులను మభ్యపెడుతున్నారని విమర్శించారు.సింగరేణిలోఎన్నికలు ఎప్పుడు వచ్చినా ఐఎన్టీయూసీ సిద్ధంగా ఉందని తెలియజేశారు. సింగరేణి కార్మికుల హక్కులు సంక్షేమానికి సమర్థంగా కాపాడగల సామర్థం కేవలం ఐఎన్టీయూసీకి మాత్రమేఉందనిపేర్కొన్నారు.సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం ఆదాయ పన్ను మాఫీ , కార్మికులకు సంత ఇంటి పథకం , మెడికల్ బోర్డు పునరుద్ధరణ వంటి కీలక అంశాలను నిరంతరం మా నాయకుడు ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళు న్నారని తెలియజేశారు. ఐఎన్టియుసి అధ్యక్షులు డాక్టర్ సంజీవరెడ్డి , సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్ నాయకత్వంలో సింగరేణి సంస్థ పరిరక్షణ , కార్మికుల సంక్షేమం , నూతన హక్కుల సాధన విషయంలో ఐఎన్టీయూసీ యూనియన్ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన పోరాటం చేస్తుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ నాయకులు నాగ ప్రకాష్ , జే.వి.ఆర్ ఓసి ఫిట్ సెక్రటరీ సీతారామరాజు , కిష్టారం ఓసి ఫిట్ సెక్రటరీ బాలాజీ , నాయకులు సురేష్ , శ్రీధర్ , పొట్టి కిరణ్ , ఐ.వి.రెడ్డి, మురళీకృష్ణ, శ్రీనివాస్ రాము , తిరుమలరావు , రామచందర్, రమేష్, ఇక్బాల్ , సుదర్శన్ , రామారావు ,శ్రీనివాస చారి , శ్రీనివాసరావు, అశోక్, సదానందం , సుదర్శన్ , గణేష్ , వెంకటేశ్వర్లు, షాట్రాక్ బాబు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.







# తూడుకుర్తి యంగ్ ఇండియా పాఠశాల
# పనులు వేగవంతం చేయాలి

### నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలోని తూడుకుర్తి గ్రామంలో నిర్మాణంలో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన నిర్మాణ ప్రదేశాన్ని ఆకస్మికంగా సందర్శించి పనుల పురోగతిని సమగ్రంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పాఠశాల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి, వచ్చే విద్యా సంవత్సరం జూన్‌లో అకాడమిక్ కార్యకలాపాలు ప్రారంభమయ్యే నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఇంజనీర్లు, కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆలస్యం జరగకుండా కట్టుదిట్టమైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు.

రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని కలెక్టర్ వెల్లడించారు. ఈ పాఠశాలలు గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే దిశగా కీలక పాత్ర పోషిస్తాయని చెప్పారు. అందువల్ల నిర్మాణ పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు.

పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు సమయానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. తరగతి గదులు ఆధునిక సౌకర్యాలతో నిర్మించడంతో పాటు, విద్యార్థుల కోసం విశాలమైన డార్మిటరీలు, సక్రమమైన గాలి, వెలుతురు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అదేవిధంగా అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, ఎంట్రన్స్ గ్రౌండ్, క్రికెట్ మైదానం, ఇతర ఆట స్థలాలు, త్రాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య వసతులు వంటి అన్ని అంశాలను నాణ్యతతో నిర్మించాలన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయడమే కాకుండా, నిర్మాణంలో ఎటువంటి రాజీ పడకుండా నాణ్యత ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని ఆయన స్పష్టం చేశారు. భవిష్యత్తులో విద్యార్థులకు సురక్షితమైన మరియు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే ప్రధాన లక్ష్యమని తెలిపారు.

ఈ ప్రాజెక్ట్ పూర్తయిన తరువాత విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలతో కూడిన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తుందని, ఇది జిల్లాలో విద్యా రంగ అభివృద్ధికి దోహదం చేస్తుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

## ప్రాణాల అంచున నిలిచిన తల్లి శిశువు యశోద మలక్‌పేట
# వైద్యుల చికిత్సతో ఇరువురి ప్రాణాలు సురక్షితం

**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ప్రాణాలకు ముప్పుగా మారే అత్యంత క్లిష్ట గర్భధారణను విజయవంతంగా నిర్వహించి ముందుగానే జన్మించిన శిశువును సైతం సురక్షితంగా కాపాడిన ఘటన వైద్య రంగంలో విశేషంగా నిలిచింది. అనేక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న గర్భిణి అలాగే పుట్టిన వెంటనే శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొన్న ప్రీటర్మ్ శిశువును యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మలక్పేట్ వైద్యులు తమ నైపుణ్యం అత్యాధునిక సాంకేతికతతో కాపాడారు. 32 ఏళ్ల గర్భిణికి బైకోర్నుయేట్ యూటరస్ షార్ట్ సర్విక్స్ మధుమేహం థైరాయిడ్ రక్తహీనత వంటి అనేక క్లిష్ట సమస్యలు ఉండటంతో పాటు గతంలో గర్భధారణలో ఇబ్బందులు ఎదురైన చరిత్ర ఉండటంతో ఈ కేసు వైద్యులకు సవాలుగా మారింది. గర్భస్రావం లేదా ముందస్తు ప్రసవం జరిగే ప్రమాదం ఉన్న నేపథ్యంలో డా. జ్యోత్స్న ఆధ్వర్యంలోని వైద్య బృందం సమయానికి స్పందించి అత్యాధునిక లాపరోస్కోపిక్ అబ్డామినల్ సర్క్లాజ్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించింది. అలాగే బ్లాడర్ డిసెక్షన్ సిస్టోస్కోపీ యూరెటరోస్కోపీ వంటి ప్రక్రియలను కూడా సమర్థవంతంగా పూర్తి చేశారు. రోగిలో ఉన్న రక్తహీనతను తగ్గించేందుకు రక్తం ఎక్కించడంతో పాటు నిరంతర ఫీటల్ మానిటరింగ్ ద్వారా గర్భస్థ శిశువు ఆరోగ్యాన్ని కాపాడారు. తరువాత 34 వారాల్లో గర్భిణికి ఫీటల్ డిస్ట్రెస్ ఏర్పడటంతో అత్యవసర సిజేరియన్ ద్వారా శిశువును ప్రసవించారు. 2.13 కిలోల బరువుతో జన్మించిన శిశువుకు పుట్టిన వెంటనే శ్వాస సమస్యలు తలెత్తడంతో ఎన్ఐసీయూ లో చేర్పించి ప్రత్యేక చికిత్స అందించారు. డా. సత్యప్రియ సాహూ పర్యవేక్షణలో శిశువుకు సిపిఏపి ద్వారా శ్వాస సహాయం జాండీస్‌కు ఫోటోథెరపీ హైపోకాల్సీమియాకు మందులు అందించడంతో శిశువు ఆరోగ్యం క్రమంగా మెరుగుపడింది. కేవలం 38 గంటల్లోనే శ్వాస సమస్య తగ్గిపోవడం క్రమంగా తల్లిపాలను స్వీకరించడం ప్రారంభించడం ఎటువంటి ఇన్ఫెక్షన్ లక్షణాలు కనిపించకపోవడం వైద్యులను ఆనందానికి గురి చేసింది. చికిత్స అనంతరం తల్లి శిశువు ఇద్దరినీ స్థిర ఆరోగ్య పరిస్థితిలో డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా డా. జ్యోత్స్న మాట్లాడుతూ ఇలాంటి క్లిష్ట గర్భధారణలను సమయానికి గుర్తించి సరైన శస్త్రచికిత్స చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చునని అన్నారు. డా. సత్యప్రియ సాహూ మాట్లాడుతూ ప్రీటర్మ్ శిశువులకు తక్షణమే సరైన చికిత్స అందిస్తే ప్రమాదాలను అధిగమించవచ్చు అని తెలిపారు. యశోదా ఆసుపత్రి యాజమాన్యం తెలిపిన ప్రకారం అత్యాధునిక వైద్య సదుపాయాలు అనుభవజ్ఞులైన వైద్య బృందం సమన్వయంతో కూడిన చికిత్స విధానాల వల్ల ఇలాంటి క్లిష్ట కేసులను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని మలక్‌పేట్ యశోదా సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర తెలిపారు.






# పలు హోటల్లో సివిల్ సప్లై అధికారులు తనిఖీలు

### 15 గ్యాస్ సిలిండర్లు పట్టివేత

**వలిగొండ /అక్షిత న్యూస్:** వలిగొండ పట్టణ కేంద్రంలో మంగళవారం రోజున సబ్సిడీ గ్యాస్ సిలిండర్లను సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా పలు హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, ఇతర వ్యాపార సముదాయాల్లో గృహోపయోగ (డొమెస్టిక్) గ్యాస్ సిలిండర్లను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారనే పక్కా సమాచారంతో అధికారులు పలు హోటళ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించారు.

### 15 సిలిండర్ల పట్టివేత..



ఈ దాడుల్లో వాణిజ్య (కమర్షియల్) అవసరాల కోసం అక్రమంగా వాడుతున్న మొత్తం 15 డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను అధికారులు గుర్తించి సీజ్ చేశారు. ప్రభుత్వం సామాన్యులకు అందించే గృహోపయోగ సిలిండర్లను ఇలా యథేచ్ఛగా వ్యాపారాలకు వాడుతుండటం, దీని వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుండటంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై అధికారులు మాట్లాడుతూ.. కమర్షియల్ అవసరాలకు డొమెస్టిక్ సిలిండర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టుబడిన సిలిండర్లకు సంబంధించి, నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై నిత్యావసర వస్తువుల చట్టం, సెక్షన్ 6ఏ కింద కేసులు నమోదు చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. వ్యాపారులు తప్పనిసరిగా కమర్షియల్ సిలిండర్లనే వినియోగించాలని, ముందు ముందు కూడా ఇలాంటి తనిఖీలు కొనసాగుతాయని వారు తేల్చిచెప్పారు. ఈ తనిఖీలలో డి సి ఎస్ ఓ రోజా రాణి, డిటి బాలమణి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఆసిఫాబాద్ షీ టీమ్ ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం

**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** జిల్లా ఎస్పీ నితిక పంత్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ పట్టణంలోని అబ్దుల్ కలాం పాఠశాలలో మంగళవారం షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ హసన్, షీ టీమ్ ఇన్‌చార్జ్ ఎస్సై భిక్కలాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై భిక్కలాల్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ భద్రతపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా సంఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మొబైల్ ఫోన్



వినియోగం వల్ల కలిగే పరిణామాలు, అధికంగా మొబైల్ ఉపయోగించడం వల్ల చదువుపై ప్రభావం, ఆరోగ్య సమస్యలు వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదేవిధంగా గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి మరియు వ్యక్తిగత శుభ్రత యొక్క ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు.

కార్యక్రమంలో భాగంగా కానిస్టేబుళ్లు స్వప్న, రజని, వరలక్ష్మి, దినేష్ విద్యార్థులతో ముచ్చటిస్తూ, వారి సందేహాలకు సమాధానాలు ఇచ్చి, ఆత్మరక్షణ పద్ధతులపై అవగాహన కల్పించారు. బాలికలు ధైర్యంగా తమ సమస్యలను బయటపెట్టాలని, షీ టీమ్ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని తెలిపారు.